
PSL01C266

# పెండ్లిన చెట్లు



జనవిజ్ఞాన వేదిక

CI

ప్రచురణ
జన విజ్ఞానవేదిక
ఆల్ ఇండియా పీపుల్స్ సైన్సు నెట్‌వర్క్ అనుబంధం

PSCOIC268


# పండిన చెట్టు

నాదముని నాయుడు పెద్ద రైతు. ఎనభై ఎకరాల మెట్ట భూమికి యజమాని. ఒక విధంగా జమిందారు కిందే లెక్క.

నాలుగు జతల దుక్కిటెద్దులు.... కొట్టం నిండుగా పాడి పశువులు..... పాడి పంటలకు కొదువ లేదు. లంకంత ఇంటిలో కాపురం. అది గాక మరో మూడు పెంకుటిళ్ళు కూడా ఉండేవి.

నాదముని నాయుడి భార్య పేరు పేరక్క. వారిద్దరికి ఎనిమిది మంది సంతానం. నలుగురు మగపిల్లలు. నలుగురు ఆడపిల్లలు.

ఆడపిల్లలందరికి మంచి సంబంధాలు చూశారు. ఘనంగా పెళ్ళి చేశారు. నగా-నట్ర, చీరా - సారె దండిగా ఇచ్చారు. వారికి ఎలాంటి లోటు చేయలేదు.



కొడుకులకు కూడా - గొప్ప కుటుంబాల అమ్మాయిలను చూసి పెళ్ళి చేశారు. కోడళ్ళను చూసి మురిసిపోయారు. కొంత కాలానికి మనుమలు, మనుమరాళ్ళూ పుట్టారు. వాళ్ళను చూసి ఇంకా పొంగిపోయారు.


ఆ పిల్లలే ప్రాణంగా బతుకుతున్నారు.

పేరక్క ఆ ఇంటి కోడలిగా వచ్చినపుడు పంద తులాల బంగారం తెచ్చింది. ఆ కాలంలో పంద తులాల బంగారమంటే మాటలు కాదు. ఆడపిల్లలు నలుగురికీ ఆ బంగారం నుంచే నగలు చేయించారు. ఇంకా కొంత మిగిలితే దాన్ని మనమరాళ్ళకు ఇచ్చేశారు.

ఇప్పుడు నాదముని నాయుడి ఇల్లు పిల్లా పాపలతో కళకళలాడుతూ ఉంది. కొడుకులు, కోడళ్లు, మనుమలు, మనమరాళ్లు - ఇల్లంతా సందడే. నాదముని నాయుడు, పేరక్క ఎంతో తృప్తిగా ఉన్నారు. అయితే రోజులన్నీ ఒకేలా గడవవుగా !

ఇంటికి వచ్చిన కోడళ్లు నస పెట్టడం మొదలెట్టారు. "మీ నాన్న ముసలివాడైపోయాడు. ఆస్తి పంచమని చెప్పండి" అంటూ కొడుకుల ప్రాణాలు తినసాగారు. కొడుకులకు కూడా అదే జరగాలని ఉంది. కాని ఆస్తి పంచమని ఆడగాలంటే భయం. అందుకే అడగలేక, మానలేక గింజుకుంటున్నారు.

ఈ సంగతి మెల్లగా నాదముని నాయుడికి తెలిసింది. ఆయన ఆలోచనలో పడ్డాడు. ఒకరోజు నాయుడూ, పేరక్కా పత్తి చేలో పని చేస్తున్నారు. అప్పుడు భార్యను కూర్చోబెట్టి



అడిగాడు. "నీకేమైనా తెలిసిందటే ? మన పిల్లలు ఆస్తి పంచాలని అంటున్నారట ?" అన్నాడు.

"అందులో తప్పేముంది ? ఎప్పటికైనా పంచవలసిందేగా! మనం కూడా ముసలివాళ్ళమై పోయాం. క్రిష్ణా రామా అంటూ ఓ చోట కూచుందాం. ఇంకా ఎంత కాలం ఇలా పొలాలు పట్టుకు తిరుగుతాం ?" అంది పేరక్క.

పేరక్క మాటకు ఇక తిరుగేది ? ఆమె చెప్పింది నాయుడికి సబబుగానే అన్పించింది. మరునాడు నలుగురు కొడుకులను దగ్గరకు పిలిచాడు. ఆస్తి పంపకం గురించి మాట్లాడాడు. వాళ్ళకు చాలా సంతోషం కలిగింది. "నీ ఇష్టమే మా ఇష్టం నాన్నా" అన్నారు.

"రేపు ఎవరైనా ఒక పెద్ద మనిషిని పిలిచుకు రండి." అన్నాడు నాయుడు.

"ఆస్తి పంపకానికి పెద్ద మనిషి దేనికి నాన్నా. నువ్వేమైనా పక్షపాతం చూపిస్తావా ఏం". అన్నారు కొడుకులు.

"అలా కుదరదురా అబ్బాయిలూ. ఆస్తి పంపకం చేసేటపుడు ఓ పెద్దమనిషి తప్పకుండా ఉండాలి. మీకు నమ్మకమైన మనిషిని తీసుకురండి." అన్నాడు నాయుడు.

మరుసటి రోజు కొడుకులు - పాతపల్లె కామయ్యను పిలుచుకొని వచ్చారు. కామయ్య ఊరి పెద్ద. అందరికి కావలసిన మనిషి. ఎన్నో ఊళ్లు తిరిగినవాడు. మంచి లోకజ్ఞానం ఉన్నవాడు.

"రావయ్యా కామయ్యా" అంటూ నాదముని నాయుడు నవ్వుతూ పిలిచాడు. అయితే కామయ్య ఇంట్లోకి రాలేదు. ఆయనకు తమలపాకులు నమిలే అలవాటుంది. ఇంట్లో కూచుంటే ఉమ్మి వేయడానికి కుదరదు. అందుకే వరండాలోనే కూచుండి పోయాడు.

పేరక్క కాఫీ తెచ్చి ఇచ్చింది. కాఫీ తాగి, తమలపాకులు వేసుకున్నాడు. "ఏమిటి విశేషం ?" అని అడిగాడు. నాదముని నాయుడు సంగతి చెప్పాడు.

కామయ్య అంతా విన్నాడు. "ఎప్పుడో ఒకప్పుడు ఈ పని చేయాల్సిందేగా !" అన్నాడు. "ఆ బరువు కూడా దిగిపోతుంది" అన్నాడు. ఇంకేం. పంపకం పని మొదలయ్యింది.

ఇంట్లో వడ్ల బస్తాలు కుప్పతిప్పలుగా ఉన్నాయి. పత్తి, బెల్లం, మిరప బస్తాలు కూడా అలాగే ఉన్నాయి. వాటిని నాలుగు భాగాలు చేశారు. భూమి పుట్ర కూడా నాలుగు సమాన భాగాలు చేశారు. నలుగురికీ నాలుగు ఇళ్లు ఎలాగూ ఉన్నాయి.

లెక్కలన్నీ పూర్తయ్యాయి. నాదముని నాయుడు కొడుకులు అభిప్రాయం అడిగాడు. వాళ్లు లోపలికి వెళ్లి తమ భార్యలతో మాట్లాడారు. తిరిగి వచ్చి "సరే" అన్నారు.

నలుగురి భాగాలనూ నాలుగు చీటీల మీద రాశాడు కామయ్య. వాటిని గుండ్రంగా చుట్టాడు. రెండు చేతులతో బాగా కదిపాడు. టక్కున నేల మీద వేశాడు. మొదటి చీటీని ఆఖరివాడ్ని తీసుకోమన్నాడు. అతని తర్వాత మిగతా ముగ్గురూ తలో చీటీ తీసుకున్నారు. చీటీలో ఏ భాగం రాసి వుంటే ఆ భాగం వాళ్ళది.

ఒక్కొక్కరికి ఒక్కో ఇల్లు పంచారు. ప్రతి ఇంటిలోను కొన్ని సౌకర్యాలున్నాయి. కొన్ని ఇబ్బందులూ ఉన్నాయి. కోడళ్ళ కళ్లకు సౌకర్యాలు చిన్నవిగా కన్పించాయి. ఇబ్బందులు మాత్రం పెద్దవిగా కన్పించాయి.

తాతలనాటి ఇల్లు పెద్ద కొడుక్కి వచ్చింది. 'అన్నయ్య అదృష్టవంతుడు' అనుకున్నారు తమ్ముళ్లు. వారి పెళ్ళాలకు కడుపుమంట పట్టుకుంది.

"ఆస్తి పంపకం ఒక విధంగా పూర్తయినట్టే". అనుకున్నాడు పాతపల్లె కామయ్య. ఇంతలో నాదముని నాయుడు గబగబా ఇంటిలోకి వెళ్ళాడు. ఓ పాత కంచు బిందెతో తిరిగి వచ్చాడు



బిందెను నేలపై బోర్లించాడు. బిందె నుంచి వెండి కాసులు గలగలా రాలాయి. అన్నీ తెల్లదొరల రాజుల కాలం నాటివి !

ఆ కాలంలో పన్నెండు వెండి కాసులకు తులం బంగారం వచ్చేది. మొత్తం రెండువేల వెండి కాసులున్నాయి. వాటిని కూడా సమానంగా పంచారు. అప్పటికిగాని నాయుడికి తృప్తి తీరలేదు. ఆయన ముఖం తృప్తితో వెలిగిపోయింది. ఇప్పుడతనికి హాయిగా ఉంది.

“మన నాన్నంటే నాన్నే. ఇంతమంచివాడు ఎక్కడా వుండడు. ఎవ్వరూ తమ పిల్లలకు ఇలా పంచినవాళ్ళు లేరు”. అని పొంగిపోయారు కొడుకులు.

“ముసలాడు గట్టోడే. ఇంకా ఎక్కడెక్కడ ఏం దాచి ఉంచాడో !” అనుకున్నారు కోడళ్లు.

మొత్తానికి అందరూ సంతోషించారు. కాని పాతపల్లె కామయ్య మాత్రం బాధపడ్డాడు.

"నాయుడు పెద్ద పొరపాటు చేశాడు. ఉన్నదంతా కొడుకులకు ఊడ్చి పెట్టేశాడు. కనీసం డబ్బైనా తన దగ్గర ఉంచుకోవాల్సింది. రేప్పొద్దున్న జబ్బు చేస్తే ఎవరు చూస్తారు ? ఆ డబ్బు అక్కరకు వచ్చేది కదా !" అనుకొని మనసులో నొచ్చుకున్నాడు. పైకి మాత్రం ఏమీ అనలేదు.

"చూడండిరా అబ్బాయిలూ ! ఉన్నదంతా మీకు ఇచ్చేశాను. ఇక మా దగ్గర ఏమీ లేవు. మీ అమ్మ చెవిదిద్దులు, నా వెండి మొలతాడు తప్ప. ఇక నుంచి మాకేం కావాలన్నా మీరే చూసుకోవాలి. అయినా మాకేం కావాలని. మూడు పూటలా అన్నం, ఇంత బట్ట, తలకు కాస్త నూనె - అంతేగా !" అన్నాడు.

"అదేంటి నాన్నా అలా అంటావు. నిన్ను, అమ్మను పువ్వుల్లో పెట్టి చూసుకొంటాం !" అన్నారు కొడుకులు.

ముసలివాళ్ళిద్దరూ ఒక్కో కొడుకు దగ్గర ఒక్కో నెల ఉండసాగారు.

మొదటి నాలుగు నెలలు బాగానే గడిచాయి. ఎలాంటి ఇబ్బందీ కలగలేదు. ఆ తర్వాత ఒక్కొక్కటీ మారిపోయింది. నాయుడు అనుకొనిందొకటి. జరిగిందొకటి.

మూడు పూటల అన్నం రెండు పూటలయ్యింది. రెండు పూటల కాఫీలు ఒక పూటే అయ్యాయి. ఒకటికి పదిసార్లు అడిగితే

గాని అవసరాలు తీరడం లేదు. పేరక్కకు ఎన్నో ఏళ్లుగా తమలపాకులు బాగా వేసుకొనే అలవాటు. కొడుకుల్ని అడగలేక ఆ అలవాటును మానుకోవలసి వచ్చింది.

రాను రాను మరీ కష్టమైంది. తలకు రాసుకొనే నూనె కూడా కరువయ్యింది. కట్టుకొనే బట్టలు చిరుగు పాతలయ్యాయి. కొత్త బట్టలు కొనిచ్చే దిక్కులేదు.

నాయుడు, పేరక్క కుంగిపోయారు. వాళ్ళ శరీరాలు ఎండి పోయాయి. ఇద్దరికిద్దరూ రంగుమాసిన బట్టలా తయారయ్యారు.

పేరక్క తల నూనెలేక పిడిచకట్టుకు పోయింది. ఆమె దురదను భరించలేకపోయేది. బంక మట్టితో తల పులుముకునేది.


ఓ నాడు చిన్న కూతురు ఊరికి వచ్చింది. వయసుడిగిన అమ్మా నాన్నలను చూచింది. ఆమెకంతా అర్థమైంది. కడుపు తరుక్కుపోయింది. బాగా కోపం వచ్చింది. అన్నలను, వదినెలను తిట్టిపోసింది. కోపం పట్టలేక ఏడ్చేసింది.

నాయుడు, పేరక్క కుమిలి కుమిలి ఏడ్చారు. ఏడుస్తూనే కూతుర్ని ఓదార్చారు.

ఇద్దర్నీ తనతో వచ్చేయమని అడిగింది కూతురు. బతికినంత కాలం మంచిగా చూసుకుంటా ననింది. నాయుడు కొంతసేపు మౌనంగా ఊరుకున్నాడు. చివరకు-"చెడి, వియ్యంకుల ఇంటికి చేరడం మంచిది కాదమ్మా, నువ్వు మా కోసం బాధపడకు. మా నుదుటిన ఎలా రాసి వుంటే అలా జరుగుతుంది. నెమ్మదించి ఊరికి వెళ్ళిపో" అన్నాడు. పేరక్క కూడా అదే మాట అంది.

కూతురు ఎంతగా బతిమాలినా వాళ్లు ఒప్పుకోలేదు. చేసేదిలేక కూతురు కన్నీళ్ళు మింగుతూ వెళ్ళిపోయింది.

ముసలి వాళ్ళిద్దరికి ఆ రాత్రి నిద్రపట్టలేదు. తమ కొడుకులు ఎందుకిలా అయ్యారు ? వాళ్ళ సుఖం కోసం ఇద్దరూ రెక్కలు ముక్కలు చేసుకున్నారు. పైసా పైసా కూడబెట్టారు. ఉన్నవన్నీ వాళ్ళకు ఊడ్చిబెట్టారు. చివరకు ఆ కొడుకులేం చేశారు. ఏం గతి తమకు పట్టించారు ? పేగు తెంచుకొని పుట్టిన బిడ్డలే! అమ్మానాన్నలకు - కడుపు నిండా అన్నమైనా పెట్టలేరా ? ఒక్క మంచి మాటైనా మాటాడలేరా ? ఇవన్నీ తలచుకొని వాళ్ళు కుమిలి పోయారు. కుళ్ళి కుళ్ళి ఏడ్చారు. ఆ యింట్లో వుండాలంటే ముళ్ళ మీద ఉన్నట్టుంది. పూలమ్మిన చోట కట్టెలమ్మి నట్టుంది.




"ఎక్కడికైనా దూరంగా పోదామయ్యా. ఏదో ఒక పని చేసుకుని బతుకుదాం." అంది పేరక్క. నాయుడికి కూడా అదే మంచిదనిపించింది. "అలాగే, పోదాంలే" అన్నాడు. ఆ మాట ఏదో మాటవరస కనలేదు. గట్టిగా ఆలోచించే అన్నాడు.

నాలుగు రోజుల తర్వాత రెండో కూతురు వచ్చింది. వాళ్ళిద్దరికి ఇష్టమైన పళ్ళు, ఫలహారాలు తెచ్చింది. అమ్మా నాన్నల సంగతి ఆమెకు ముందే తెలుసు. తనతో పాటు రమ్మంటే రారు. ఆమె మాత్రం ఏం చేస్తుంది ? వెళ్ళిపోతూ కొంత డబ్బు చేతిలో పెట్టింది. "మీకిష్టమైంది కొని తినండి" అంది.


కూతురిచ్చిన డబ్బుని వాళ్ళు వద్దనలేదు. మాట్లాడకుండా తీసుకున్నారు. ఎక్కడికైనా పోవాలంటే డబ్బు కావాలి. అందుకే కాదనకుండా తీసుకొన్నారు.

మరో రెండు రోజులు గడిచాయి.

మూడోనాడు మొదటి జాములోనే లేచారు. పొద్దెక్కడానికి ఇంకా చాలా సమయముంది. ఊరంతా నిద్రమత్తున మునిగి వుంది.

కట్టుబట్టలతో ఇద్దరూ బయలుదేరారు. ఎవరి కంటనైనా పడతామేమో ! అని భయం భయంగా నడిచారు. భయపడుతూనే పొరుగూరు చేరుకున్నారు. అక్కడ కనిపించిన బస్సు ఎక్కేశారు. ఆ బస్సు విజయవాడకు పోతుంది.


ఎండ నెత్తికొచ్చేప్పటికి వాళ్ళిద్దరూ విజయవాడలో ఉన్నారు. ఇంకా దూరంగా పోవాలి. తమ కొడుకులకు కనిపించనంత దూరంగా పోవాలి. దానికి ఏం చేయాలి ? చెవిదిద్దులు, వెండి మొలతాడు అమ్మేశారు. మరికొంత డబ్బు చేతికొచ్చింది. తిన్నగా రైలు స్టేషన్‌కి పోయారు.



విజయవాడ రైలు స్టేషన్ చాలా పెద్దగా ఉంటుంది. ఎక్కడ చూచినా జనమే. వచ్చే రైళ్లు పొయ్యే రైళ్ళు. ఎక్కడికి పోవాలో తోచలేదు. ఏమీ పాలుపోక ఓ బెంచీ మీద కూర్చున్నారు.

ఇంతలో ఓ పాప పరిగెత్తుకుంటూ వచ్చింది. "అవ్వా అవ్వా" అంటూ పేరక్కను పట్టుకొంది. దానికి మూడేళ్లుంటాయి. ఆ పాపను చూడగానే పేరక్కకు ప్రాణం లేచి వచ్చింది. పాపను ఎత్తుకొని ముద్దాడింది. పాపతో కబుర్లు చెప్పడం మొదలెట్టింది. ఈలోగా పాప అమ్మానాన్నలు అక్కడికి చేరుకున్నారు. వాళ్ళు విశాఖపట్టణం వెళుతున్నారట ! ఇంకేం. వీళ్లు కూడా వాళ్ళతో పాటే బండెక్కేశారు.

బండి చప్పుళ్లు జోలపాటలా అన్పించాయేమో. పేరక్కకు నిద్ర పట్టేసింది. కూర్చునే ఆమె నిద్రపోసాగింది. నాయుడు ఆమె వంక బాధగా చూశాడు.





"ఎలాంటి కుటుంబంలో పుట్టిన పిల్ల ! ఎంత దర్జాగా బతికిన మనిషి ! ఎలాంటి మనిషి ఎలా అయిపొయ్యింది. ఎన్ని కష్టాలు పడుతోంది". అని కుమిలిపోయాడు. ఆయనకు కన్నీళ్ళు ఆగలేదు. రైలు బండి పోతూనే ఉంది.....

ఊళ్ళో తెల్లారింది. నాయుడూ పేరక్కా సంగతి గుప్పున ఊరంతా పాక్కింది. ఈ సంగతి ఊళ్ళో వాళ్ళకే ముందు తెలిసింది. కొడుకులకి తర్వాత తెలిసింది. వాళ్ళు తట్టుకోలేక పొయ్యారు. ఎంతైనా కనిపెంచిన వాళ్ళుగదా. పైగా ఊరంతా గుసగుసలాడసాగింది. కొడుకులకు తల తీసేసినట్టుంది.

కోడళ్లు మాత్రం గొణుక్కొన్నారు. "పెట్టింది తిని ఓ మూల పడుండొచ్చుగా - ముసలాళ్లకి ఇదేం రోగం ?" అంటూ మండిపడ్డారు.

రోజులు గడుస్తున్నాయి.

ఓనాడు ఊళ్ళో ఒక వార్త గుప్పుమనింది. ఎవరో ముసలాళ్ళుట. ఆలు మగల్లా వున్నారు. బావిలో పడి చచ్చి తేలుతున్నారు. ఇదే ఆ వార్త !




అందరూ పరిగెత్తుకెళ్లారు. అయితే వాళ్లు నాయుడు, పేరక్క కాదు. ఇంకెవరో వాళ్ళలాగే దిక్కులేనోళ్లు. కొడుకులు ఊపిరి పీల్చుకున్నారు. కొంతకాలం అమ్మా నాన్నల కోసం ఇక్కడా అక్కడా వెదికారు. తెలిసిన ఊళ్ళలో వెదికించారు. లాభం లేకపోయింది. కళ్ళ ముందు ఉన్నప్పుడే సరిగ్గా పట్టించుకోలేదు. కనిపించకుండా పోయాక ఇంకేం పట్టించుకుంటారు ! ఎప్పుడో ఒకప్పుడు తిరిగొస్తారు లెమ్మని సరిపెట్టుకొన్నారు.

నాలుగేళ్లు గడిచాయి.

ఒకనాడు పాతపల్లె కామయ్య తీర్థయాత్రకు బయలుదేరాడు. ఒక్కో పుణ్యక్షేత్రం తిరుగుతున్నాడు. ఒక్కో దేవుణ్ణి సేవించుకొంటున్నాడు. కొన్ని రోజులకు సింహాచలం చేరుకున్నాడు. అక్కడ "సింహాద్రి అప్పన్న గుడి" కొండ మీద వుంది. అప్పన్న దర్శనం కోసం కామయ్య మెట్లు ఎక్కుతున్నాడు. మెట్లకు రెండువైపులా బిచ్చగాళ్ళు కూర్చున్నారు.

కొందరు బిచ్చగాళ్ళు తమ ముందు గుడ్డలు పరిచారు. కొందరు సత్తు గిన్నెలు పట్టుకున్నారు. ఇంకొందరు చేతులతోనే బిక్ష తీసుకుంటున్నారు. కామయ్య బిచ్చగాళ్ళకు చిల్లర డబ్బులు వేస్తూ మెట్లు ఎక్కుతున్నాడు. ఉన్నట్టుండి ఆయనకు ఏదో అనుమానం వచ్చింది. చప్పున వెనక్కి తిరిగి చూశాడు.

బిచ్చగాళ్ల మధ్య ఓ ముసలమ్మ, ముసలాడు కూర్చున్నారు. ఇద్దరూ గుండ్లు కొట్టించుకున్నారు. వాళ్ళను ఎక్కడో



చూసినట్లుంది. కామయ్య గుడ్లప్పగించి చూశాడు. బాగా పరికించి చూశాడు. వాళ్ళెవరో గుర్తుపట్టి అదిరిపడ్డాడు.

వాళ్ళిద్దరూ ఎవరో కాదు. ఒకప్పుడు రాజుల్లా బతికిన నాయుడు, పేరక్క !

కామయ్య తన కళ్లను తాను నమ్మలేకపోయాడు. వాళ్లని చూసి తట్టుకోలేకపోయాడు. గుండెలు బాదుకొని పెద్దగా ఏడ్చాడు.

ముసలివాళ్లు మాత్రం ఏడవలేదు. కనీసం కంటతడి పెట్టలేదు. నాయుడైతే కామయ్య ఎవరో తెలీనట్టే చూశాడు.

పాతపల్లె కామయ్యను పేరక్క గుర్తుపట్టింది. నోరు తెరిచి ఒకే ఒక్క మాట అడిగింది.

"నా పిల్లలందరూ బాగున్నారా ?"

❄ ❄ ❄

# పండిన చెట్టు

## లెవెల్ - 4


మొదటి ముద్రణ : మే, 1992

మూడవ ముద్రణ : నవంబరు 2009

సీరిస్ సంపాదకుడు

వి. బాలసుబ్రమణ్యం

వెల : 10/-

ప్రతులకు

ప్రజాశక్తి బుక్‌హౌస్

1-1-187/1/2 వివేక్‌నగర్,

చిక్కడపల్లి, హైద్రాబాద్-20, ఫోన్ : 27608107

బ్రాంచీలు

హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం,

హన్మకొండ, నల్గొండ, గుంటూరు

సి. మోహన్

కన్వీనర్ - జె.వి.వి. ప్రచురణల విభాగం

జి.ఎఫ్ -4, నీహారికా అపార్ట్‌మెంట్స్, గాయత్రి నగర్,

ముత్యాలరెడ్డిపల్లి, తిరుపతి -517 502.

ఫోన్ : 0877 -2244551

ముద్రణ

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్.

బడిలో అప్పుడే చేరిన వాళ్ళు, ఒకటో తరగతి చదువుతున్న వాళ్ళు కూడా పుస్తకాలు చదవగలరా? వాళ్ళకు కూడా పుస్తకాలు వుంటాయా? రచయితలు వాళ్ళ కోసం కూడా పుస్తకాలు రాస్తారా?

ఇప్పుడివన్నీ అర్థంలేని ప్రశ్నలు. పిల్లలు చదవడం పలు రూపాల్లో వుంటుంది. బొమ్మల్ని వాళ్ళు చదువుతారు. గుర్తుల్ని వాళ్ళు చదువుతారు. బొమ్మల్ని చూచి అక్షరాల్ని వాళ్ళు చదువుతారు. బొమ్మల్ని చూసి కథల్ని వాళ్ళు చదువుతారు.

ఇలా చదివించడమే భాష నేర్పించడంలోని కీలకం. అప్పుడు పలకల్ని, బలపాల్ని అరగదియ్య పన్లేదు. గుడ్డి కంఠస్తాలు, ఇంపోజిషన్లు, చూచి రాయడాలు అక్కర్లేదు.
అసలు మనం నెత్తి మీద కూచుని భాష నేర్పనక్కరలేదు.

ఇలా సహజంగా, స్వయంగా పిల్లలు
భాష నేర్చుకోడానికి ఈ ప్రయత్నం.
ఈ పుస్తకాలు నాలుగు గ్రేడ్ల, 50 పుస్తకాల సీరీస్‌లోవి.
ఇది 4-5 తరగతుల పిల్లలకోసం.

జనవిజ్ఞాన వేదిక
ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ అనుబంధం

18

# Check List

| | | | |
|---|---|---|---|
| **Book Number** | PSL01C266 | **Date** | 16/11/22 |
| **Front Cover** | yes | **Back Cover** | yes |
| **Blank Pages** | NO | | |
| **Missing Pages** | NO | | |
| **Prepared By** | Mounika | **Cutting By** | Mouni |
| **Scanned By** | Mounika | **Pages** | 21 |